క్లుప్తంగా

పరిశుభ్రతకు ప్రాధాన్యత

వైవీయూ : మహిళలు వ్యాయామానికి, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని గైనకాలజిస్టు డాక్టర్ పల్లా తేజస్విని సూచించారు. మంగళవారం కడప నగరంలోని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్, మహిళల గర్భకోశ సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రక్తహీనతను ఎదుర్కొనేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు వ్యాయామాన్ని చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా పాల్గొన్నారు.

అందుబాటులో ఎల్ఐసీ జీవన్ ఉత్సవ్

కడప కల్చరల్ : జీవన్ ఉత్సవ్ పాలసీని ఎల్ఐసీ అందుబాటులోకి తెస్తున్నదని, ప్రత్యేకించి ఆధునిక యువతరం ఆదరించాలని ఎల్ఐసీ కడప సీనియర్ డివిషనల్ మేనేజర్ కె. గిరిధర్ తెలిపారు. 90 రోజుల వయసున్న శిశువు నుంచి 65 సంవత్సరాలు వయసున్న వ్యక్తి వరకు ఈ పాలసీ తీసుకోవచ్చని వివరించారు. ప్రీమియం చెల్లింపు కాలం తక్కువ ఉండాలని కోరుకునే వారికి ఇది ఉపయుక్తమైన పాలసీ అని అన్నారు. ఈ కాలాన్ని ఐదు సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల వరకు ఎంచుకోవచ్చన్నారు. సాఫ్ట్‌వేర్ లాంటి ఆధునిక యువతకు ఇది ఆకర్షణీయమైన పాలసీ అని అన్నారు. కనిష్ట బీమా మొత్తం ఐదు లక్షలని, గ్యారంటీడ్ అడిషన్స్ ఈ పాలసీ ప్రత్యేకత అన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

కడప స్పోర్ట్స్: అంతర్ జిల్లాల కబడ్డీ మహిళల చాంపియన్‌షిప్‌లో వైఎస్ఆర్ కడప జిల్లా జట్టు క్రీడాకారిణులు విజేతలుగా రాణించాలని వైఎస్ఆర్ జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఓ. రవీంద్రారెడ్డి, కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య కోరారు. ఈనెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కర్నూలు జిల్లా గోనగండ్లలో నిర్వహించనున్న 70వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా మహిళల జట్టుకు క్యాంపు అనంతరం క్రీడాదుస్తులు, రవాణా చార్జీలు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కబడ్డీ సంఘం కోశాధికారి సి. కొండయ్య, సంయుక్త కార్యదర్శి సునీల్, డీఎస్ఏ శిక్షకుడు ఆర్.వి. శ్రీధర్, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



కడప ఎడ్యుకేషన్: రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం అవుతుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేక అధికారి శివశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని స్పిరిట్ కాలేజీలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన పలువురు బాలబాలికలు ఉత్సాహంగా రక్తదానం చేశారు. స్పిరిట్ కాలేజీ డైరెక్టర్ ఎంసి రవీంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రక్తదానం చేసిన వారికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారు బహుమతులను ప్రదానం చేశారు.


బదిలీలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్: మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, ఉన్నత పాఠశాలల్లో అన్ని పోస్టులు అప్‌డేట్ చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు కోరారు. సంబంధిత సమస్యలను పరిష్కరించాలని డిసెంబర్ 30వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయాలన్నారు. మంగళవారం కడపలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిలర్లు రూతు ఆరోగ్యమేరీ, ఆడిట్ కమిటి కన్వీనర్ ప్రభాకర్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అన్నదానం చేయడం పుణ్యకార్యమని మాలమహానాడు నగర అధ్యక్షులు చెంచుల డేవిడ్ సత్యరాజు తెలిపారు. మంగళవారం నగరంలోని బృంద వృద్ధాశ్రమంలో మాలమహానాడు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు మణి, మైనార్టీ అధ్యక్షులు మస్తాన్, బృంద వృద్ధాశ్రమ నిర్వాహకులు బాలసుబ్బయ్య, మేనేజర్ సుధారాణి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు జ్యోతిరావు పూలే



కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

కడప కార్పొరేషన్: భారతదేశంలో మొదటి సారిగా మహిళల విద్య కోసం పాటుపడిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని, ఆయన అందరికీ స్ఫూర్తి ప్రదాత అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాష అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిలతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు పాత బస్టాండ్ సర్కిల్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. తరతరాలుగా అణచివేతకు గురైన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు పూలే అండగా నిలిచి వెనుకబడిన వర్గాల వారికి ఆశాజ్యోతి అయ్యారన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలను.. దోపిడీ వ్యవస్థ, అంటరాని తనం నుండి విముక్తి చేయడానికి నిరంతరం కృషి చేశారన్నారు. సమాన హక్కుల కోసం, కులవ్యవస్థ నిర్మూలనకు, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం.. సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కుల వ్యవస్థను రూపుమాపాలంటే.. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నతంగా అభివృద్ధి చెందాలంటే.. ఒక్క విద్య వల్లనే సాధ్యం అవుతుందని, అందరికీ చదువు ఎంతో అవసరమని పాఠశాలలను రూపొందించారన్నారు. తన సతీమణిని ఉపాధ్యాయురాలిని చేసి స్త్రీలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, మహిళా సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడన్నారు. వైఎస్ఆర్.. మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకొని పరిపాలన చేశారని, బీసీ వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆలోచనతో అనేక అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలు వెనుకబడిన తరగతుల కులాల వారు కాదని బి.సి.లు అంటే బ్యాక్ బోన్ క్లాస్ అని చెప్పి వెన్నుతట్టి ముందుకు నడిపిస్తున్న పరిస్థితిని మనం గమనిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, ఆ పార్టీ నాయకులు సీహెచ్ వినోద్, వేణుగోపాల్ నాయక్, ఎస్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, షఫీ, త్యాగరాజు, శివానాయక్, నాగరాజు, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, సంధ్యారాణి, నారాయణమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ: బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం, అభ్యున్నతికి కృషిచేసిన మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు మనందరికీ ఆదర్శమని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ దేశంలో అసమానతలు లేని సమాజం కోసం, సమానత్వం, హక్కుల కోసం ఎనలేని కృషిచేసిన మహనీయులు పూలే అన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు మహిళల విద్యకోసం ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. ఇ.సి. సుప్రియ, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్, అనిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనతోనే నవ సమాజం

కడప రూరల్: సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా వివిధ సంఘాలకు చెందిన నేతలు పాత బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పూలే ఆశయ సాధనతోనే నవసమాజం ఏర్పడుతుందని అన్నారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గురుస్వామి, త్రివిక్రమ్, సీఆర్ఐ సునీల్‌జయంత్, వల్లూరు నారాయణమ్మ, కళ్యా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఎంబీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బాదుల్లా, పగడాల పెద్దన్న, విజయకుమార్, కులాయప్ప తదితరులు పాల్గొన్నారు.

– జాతీయ బీసీ మహా సభ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవీ రమణ, షిండే భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మహాత్మా జ్యోతిరావు పూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఓబీసీ జిల్లా అధ్యక్షులు చిన్న కుళ్ళాయప్ప పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, సమాచార హక్కు చట్టం రాష్ట్ర చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే అని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా నగరంలోని పాతబస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, యూసఫ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూలే వర్ధంతి

కడప ఎడ్యుకేషన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళాసాధికారత సాధించేందుకు పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ అన్నారు. పూలే వర్ధంతి పురస్కరించుకుని కడపలోని ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఒరుగంటి నాగేంద్రబాబు, నగర నాయకులు సాయిపవన్, సందీప్, మణిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో...

కడపలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ఐటీఐ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటీఐ టీఓలు చిన్నప్ప, నారాయణరెడ్డి డీటీఓ రాజశేఖర్, ఏటీఓ విజయ్‌కుమార్ విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర కార్యదర్శి విశ్వనాథ్, నగర నాయకులు అశోక్‌బాబు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాష అన్నారు. కడప నగర పాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆయుబ్, ఖాజాపీర్, ఖాదర్‌బాషు, మహబూబ్‌బాష, షాహుబుద్దీన్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఐజయ్య, వాజిద్, కరీముల్లా, పీఆర్‌పీ ఆదిమూలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా పూలే గొప్ప సంఘ సంస్కర్త

కడప కార్పొరేషన్: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని పలువురు బీసీ నాయకులు కొనియాడారు. మంగళవారం పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక పాతబస్టాండులోని పూలే విగ్రహానికి బీసీ నాయకురాలు నారాయణమ్మ, గోవిందు నాగరాజు, కళ్యా సుధాకర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సామాజిక విప్లవకారుడు పూలే అని జాతీయ బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున అన్నారు. పాత బస్టాండులోని పూలే విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కన్వీనర్ పీవీ రమణ, రాయలసీమ కన్వీనర్ షిండే భాస్కర్, వీర్ శంకర్, నాగేశ్వరరావు, కేశవులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు. ట్రాన్స్‌కో నిలయంలో పూలే వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, ఎస్ఏఓ నరసింహమూర్తి, డీఈలు సుదీంద్రరావు, నాగరాజారావు, ఏఈలు రమణ, రామ్మోహన్, అనిల్, రెడ్డి శేఖర్, వీరాంజనేయులు పాల్గొన్నారు.



కడప కార్పొరేషన్: ట్రాన్స్‌కో నిలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉద్యోగులు



కడప ఎడ్యుకేషన్: పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు



కడప రూరల్: పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న గోవిందు నాగరాజు



ఏఎఫ్‌యూ: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య ఇసి. సురేంద్రనాథ్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇలియాస్‌బాష తదితరులు



కడప వైఎస్ఆర్ సర్కిల్: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోస్టు కార్డు ఉద్యమం

కడప కార్పొరేషన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం భోజన విరామ సమయంలో హెడ్ పోస్టాఫీసు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యో గులు మాదిరిగానే ఎనర్జీ అసిస్టెంట్లకు 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై. కృపాకర్, నాయకులు ప్రకాష్‌రావు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కొండూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కొండూరుగ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనాలుగున్నరేళ్లలో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేపట్టిన జగన్‌ను ప్రతి ఒక్కరు ఆదరించాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, రాజారెడ్డి, సుబ్బరామిరెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించండని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని యు.రాజుపాలెం గ్రామంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని సచివాలయ పరిధిలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, మస్తాన్‌రెడ్డి, నాగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రసాదురెడ్డి, వీరభద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం ఎర్రగుడిపాడు సచివాలయం పరిధిలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

సంక్షేమ పాలన అందాలంటే మళ్లీ జగనన్నే రావాలి



నెహ్రూ నగర్‌లో పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



28వ డివిజన్‌లో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే నవరత్నాల రూపంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మల్లికార్జున, 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక 6వ డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్ఎఫ్ టైర్స్ వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్నాలుగేళ్ల టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ ఈ జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వైఎస్ ముఖ్యమంత్రి అయ్యాకే జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే భారీ స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్, జెండా, టోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో....

28వ డివిజన్‌లో శారదానిలయం స్కూల్ వద్ద 'ఆంధ్రాకు ఎందుకు జగనే కావాలి' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు హరూన్‌బాబు, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్ఎండీ షఫీ, 28వ డివిజన్ కార్పొరేటర్ అరీఫుల్లా బాషా ఈ కార్యక్రమంలో పాల్గొని, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రదర్శించారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్ల డివిజన్‌కు రూ.18 కోట్ల లబ్ధి జరిగిందని వివరించారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌లు, కరపత్రాలు అందజేశారు.

15వ డివిజన్‌లో....

కడప నగర శివార్లలోని 15వ డివిజన్ సరోజినీ నగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు పి. జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, 15వ డివిజన్ కార్పొరేటర్ కె. లక్ష్మీదేవిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు.

వన్ స్టాప్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వన్‌స్టాప్ సెంటర్ ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తంగా నిలుస్తోందని, బాధిత మహిళలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం రిమ్స్ ఆవరణంలోని వన్‌స్టాప్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించి ఒకే చోట అనేక సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం , మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలను పొందవచ్చన్నారు. అనంతరం ఆమె ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. మహిళలు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ మొదలగు టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వారిని సంప్రదించవచ్చన్నారు.



వన్‌స్టాప్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న న్యాయమూర్తి కవిత

ఉత్సాహంగా వైవీయూ రెండోదశ క్రీడాపోటీలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల రెండోదశ క్రీడాపోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం వైవీయూలోని క్రీడాశాస్త్రశాఖ ఆవరణంలో నిర్వహించిన పోటీలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వైవీయూ క్రీడాకారులు చక్కగా రాణిస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయ ఖ్యాతిని జాతీయస్థాయిలో ఎగురవేయాలని ఆకాంక్షించారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో క్రీడాకారులకు ప్రత్యేకంగా వసతులు కల్పించామన్నారు. వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా.కె.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రెండోదశలో యోగ, టగ్‌ఆఫ్‌వార్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు, ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో యోగ నిపుణుడు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, వైవీయూ పరిధిలోని పలు కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

లిటరరీ క్లబ్ సభ్యత్వ నమోదుపై స్పెషల్ డ్రైవ్

వైవీయూ/ కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి మార్గదర్శనంలో సాహిత్య పాఠకుల సమూహంలో శాశ్వత సభ్యత్వ నమోదు ప్రక్రియ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలతో పాటు ఆసక్తి చూపే జూనియర్ కళాశాలలు, సంస్థల్లో సభ్యత్వం కోసం స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు.

తొలి శాశ్వత సభ్యత్వం..

నగరంలోని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా లిటరరీ క్లబ్‌లో తొలి శాశ్వత సభ్యత్వం మంగళవారం తీసుకున్నారు. ఈయనతో పాటు డా. గురుమోహన్‌రెడ్డి, డా. జి. విజయలక్ష్మిలు సైతం సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఖ్యాతిగడించిన సీపీ బ్రౌన్ లైబ్రరీలో శాశ్వత సభ్యత్వం తీసుకోవడం ద్వారా వివిధ రకాల పరిశోధన, జ్ఞానసంబంధమైన పుస్తకాలను వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి, లైబ్రేరియన్ హరిభూషణ్‌రావు పాల్గొన్నారు.



లిటరరీ క్లబ్‌లో తొలి సభ్యత్వాన్ని తీసుకుంటున్న ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

ప్రజారోగ్యానికి పాటుపడితేనే హోటళ్లకు ఆదరణ

– ఫుడ్ కంట్రోల్ అధికారి ప్రభాకర్‌రావు

కడప కల్చరల్ : ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ రుచి శుచి ఉండేలా ఆహారాన్ని అందించగలిగే హోటళ్లకు ప్రజాదరణ లభిస్తుందని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ప్రభాకర్ రావు అన్నారు. మంగళవారం కడప హోటల్స్ అండ్ ఫుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక షాహి దర్బార్ సమావేశ మందిరంలో 'హోటల్లో ఆహారం, ఆరోగ్య భద్రత, ఆతిథ్యరంగం' తదితర అంశాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకర్ రావు మాట్లాడుతూ హోటళ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రంగులు, టేస్టింగ్ సాల్ట్ మోతాదుకు మించి వాడడం ప్రమాదకరమన్నారు. ఈ అంశాలపై వస్తున్న మార్పులు, సూచనలతో హోటల్ సిబ్బందికి, యజమానులకు తరచూ ఫాస్ట్ ట్రాక్ శిక్షణతో పాటు ఉత్తమ హోటళ్లకు హైజెనిక్ రేటింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫుడ్ ఇన్‌స్పెక్షన్ అధికారి ఎండీ షంషేర్‌ఖాన్ మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ చట్టాలను హోటల్ యజమానులు పాటించాలన్నారు. రాష్ట్ర హోటలర్ల సంఘం జోనల్ వైస్ ప్రెసిడెంట్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం హోటల్ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. హోటలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మాట్లాడారు. సంఘం కార్యదర్శి ఎం. నవీన్, కోశాధికారి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ఈసీ మెంబర్ రామకృష్ణారెడ్డి, షాహిదర్బార్ ఆజం, కార్పొరేటర్ షఫీ, సభ్యులు ఫరూక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫుడ్ కంట్రోల్ అధికారి ప్రభాకర్‌రావు

ప్రత్యేక ప్రార్థనలు

కడప కల్చరల్ : కడప అమీన్ పీర్ పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాల సందర్భంగా అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భగవంతుడి దయతో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గురువులను ప్రార్థించామన్నారు. అనంతరం దర్గాలో ఆయన కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆశీస్సులు పొందారు.

– పెద్ద దర్గాను జీకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్ బాష, ఆరిఫ్‌బాష దర్శించుకున్నారు. పీఠాధిపతి ఆశీస్సులు తీసుకుని అన్ని మతాల చిహ్నం గల ఫోటోను ఆయన నుంచి పొందారు.



ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి